RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 32 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 3 నవంబర్ 2024

## కెనడా మంత్రి వ్యాఖ్యలపై భారత్ అసంతృప్తి

**నిరాధార ఆరోపణలు ఖండిస్తున్నాం**
**విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్**



న్యూఢిల్లీ, నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై కెనడా మంత్రి చేసిన వ్యాఖ్యలపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై కెనడా హైకమిషన్ ప్రతినిధిని పిలిపించామని విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. కమిటీ ముందు హోంశాఖ మంత్రి షా గురించి కెనడా మంత్రి డేవిడ్ మారిసన్ చేసిన నిరాధారమైన ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా నిరసిస్తోందన్నారు. భారత్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు, ఇతర దేశాలను ప్రభావితం చేసే వ్యూహంలో భాగంగా కెనడా ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగానే అంతర్జాతీయ మీడియాకు లీక్ ఇస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహిత చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర పరిణామాలను కలిగిస్తాయని హెచ్చరించారు. ఇటీవల కెనడా ఖలిస్తానీ ఉగ్రవాది హత్యకుట్రలో భారత కేంద్ర మంత్రి అమిత్ షా పేరును ప్రస్తావించింది. ఆ దేశ విదేశాంగ వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ డేవిడ్ మారిసన్ లీకుల ఆధారంగా ది వాషింగ్టన్ పోస్ట్ పత్రిక కథనం ప్రచురించింది. లీకులను తాను చేసినట్లుగా మారిసన్ అంగీకరించారు. ఈ కుట్ర వెనుక అమిత్ షా హస్తమున్నదని తానే వాషింగ్టన్ పోస్టుకు చెప్పానని కెనడా పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట డేవిడ్ మారిసన్ అంగీకరించారు. ఆ పత్రిక జర్నలిస్టు తనకు కాల్ చేసి ఆ కుట్ర వెనుక ఉన్నది ఆయనే (అమిత్ షా) నా అని అడిగారని.. ఔనని చెప్పినట్లు వివరించారు. భారత అధికారులు, అమిత్ షా ప్రమేయం ఉన్నదని కెనడా అధికారులు చెప్పారంటూ ఇటీవల వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ఇటీవల ఓ కథనం ప్రచురించింది. అయితే, కెనడా అధికారులు మాత్రం ఇందుకు ఆధారాలు చూపడంలో విఫలమయ్యారు. ఈ వ్యవహారంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




- గత పాలకుల వల్ల గర్భిణులు రోడ్ల మీదే ప్రసవాలు
- మంచి రోడ్లు నాగరికతకు చిహ్నం
- సంక్రాంతి వరకు గుంతల రోడ్లు కనిపించొద్దు : సీఎం చంద్రబాబు
- ఉత్తరాంధ్రలో కొనసాగుతున్న చంద్రబాబు పర్యటన
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటన
- వెన్నెలపాలెంలో రోడ్లు గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్న సీఎం

# గుంతలు లేని రోడ్లే మా ధ్యేయం

గుంతలు లేని రోడ్లే తమ ధ్యేయం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి పరవాడలో గుంతలు పడిన రోడ్లను పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గుంతలు లేని రోడ్లకు శనివారం అనకాపల్లి జిల్లాలోని వెన్నెలపాలెంలో శ్రీకారం చుట్టామని తెలిపారు.

2లో



2లో

## శ్రీశైలమల్లన్న ఆలయంలో ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

# మంత్రి లోకేశ్ టూర్ సక్సెస్

**వారం రోజులపాటు అమెరికాలో పర్యటించిన లోకేశ్**
**త్వరలో ఏపీకి భారీగా పెట్టుబడులు**



అమరావతి, నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :
రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. గత వారం రోజులుగా అమెరికాలో మంత్రి పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా లోకేష్ అమెరికా పర్యటన కొనసాగింది. వారం రోజుల పర్యటనలో 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడంలో మంత్రి సక్సెస్ అయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను ఆవిష్కరించారు. ఐదేళ్ల విధ్వంసక పాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడమే లక్ష్యంగా లోకేష్ టూర్ సాగింది. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై పలు దిగ్గజ కంపెనీలు సానుకూల సంకేతాలు ఇచ్చాయి. లోకేష్ భేటీల నేపథ్యంలో జనవరిలో దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సులో పెద్ద ఎత్తున ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. లోకేష్ పర్యటన విజయవంతంపై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అమెరికాలో లోకేష్ బిజీబిజీగా గడిపారు. దిగ్గజ కంపెనీలతో భేటీ అవుతూ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది మంచి అవకాశం అంటూ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ఈ క్రమంలో ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలు వస్తే రాష్ట్రంలో చాలా మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. జగన్ హయాంలో ఎక్కడా కూడా పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ అభివృద్ధే లక్ష్యంగా దూసుకెళ్తోంది.



## ప్రజాధనం దుర్వినియోగం

నేను చాలా దేశాలు తిరిగాను కానీ ఇంత లగ్జరీ చూడలేదు: సీఎం చంద్రబాబు
రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన చంద్రబాబు
లగ్జరీ అదిరిపోయిందని వ్యాఖ్యలు
ఇలాంటి లగ్జరీని కలలో కూడా ఊహించలేమన్న చంద్రబాబు

2లో

## జమ్ము కశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదులు ఏరివేత

**ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆర్మీ**



2లో

## విజయనగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి

**4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ**
**28వ తేదీన ఎన్నికలు**




విజయనగరం
నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :
విజయనగరం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు హడావుడి మొదలైంది. శనివారం నుంచి ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. పట్టభద్రులైన ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభమైంది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విల్లూరుతున్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఆశావహులైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు శనివారం షెడ్యూల్ విడుదల అయింది ఈరోజు నుంచి విజయనగరం జిల్లాలో ఎన్నికల నియమావళి అమలు కానుంది. ఈ నెల 28వ తేదీన విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 12న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఈ నెల 14వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఈ నెల 28న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటింగ్ జరుగుతుంది. రఘురాజుపై అనర్హత వేటుతో విజయగనరం జిల్లా ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.




## మొదలయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

- నిలిచిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను
- మళ్లీ పట్టాలెక్కించిన ఏపీ ప్రభుత్వం
- అభ్యర్థులకు గుడ్ న్యూస్ అందించిన కూటమి ప్రభుత్వం
- నిలిచిపోయిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రారంభించేందుకు చర్యలు
- ఫిజికల్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం

2లో

## మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు...

**అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారంటూ గోరంట్ల మాధవ్‌పై ఫిర్యాదు**



2లో

# శ్రీశైలమల్లన్న ఆలయంలో ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

శ్రీశైలం నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :



అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైల మల్లన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికంగా దివ్యమైనదిగా భావించే ఈ మాసంలో మల్లికార్జున స్వామివారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈనేపథ్యంలో నెల రోజులపాటు గర్భాలయ దర్శనాలను అధికారులు నిలిపివేశారు. అదేవిధంగా శని, ఆది, సోమవారాల్లో మలన్న స్పర్శదర్శనాన్ని కూడా బంద్ చేశారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సామూహిక అభిషేకాలు, స్పర్శ దర్శనాలు యధావిధిగా కొనసాగుతాయి. కార్తికమాసంలో దీపాలు వెలిగించడాన్ని భక్తులు శుభప్రదంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉత్తర మాఢ వీధుల్లో మట్టి దీపాలు వెలిగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్తీకమాస పర్వదినాలు, సెలవు రోజులలో భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీక మాసమంతా కూడా గర్భాలయ ఆర్జిత అభిషేకాలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే కార్తీకమాస రద్దీ రోజులలో అనగా శని, ఆది, సోమ వారాలు శుద్ధ ఏకాదశి, కార్తీక పూర్ణిమ మొదలైన రోజులు ( కార్తీకమాసంలో మొత్తం 16 రోజులు) స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలిపివేశారు. ఈ రద్దీ రోజుల్లో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలిపివేశారు. కార్తీకమాసంలో ఉచిత స్పర్శదర్శనం తాత్కాలికంగా రద్దు చేశారు. సాధారణ రోజుల్లో రోజుకు మూడు విడతలుగా స్పర్శదర్శనం, మూడు విడతలుగా సామూహిక ఆర్జిత అభిషేకాలకు అవకాశం కల్పించబడుతుంది. కాగా భక్తులు స్పర్శదర్శనం టికెట్లను, ఆర్జిత అభిషేకాల టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే పొందవలసి ఉంటుంది. ఇప్పటికే నవంబర్ నెల టికెట్ల కోటాను దేవస్థానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరిగింది. టికెట్ల లభ్యతను బట్టి ప్రారంభ సమయానికి కంటే ఒక గంట ముందు వరకు కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లను పొందే అవకాశం కల్పించబడింది. టికెట్లను . వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు లేదా ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కూడా టికెట్లు పొందవచ్చు.

# సాగర్‌లో పర్యాటక శోభ

## శ్రీశైలం వరకు లాంచీ ప్రారంభం



నాగార్జునసాగర్,నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి : తెలంగాణ ప్రకృతి పర్యాటకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు అద్భుత బోటు ప్రయాణాన్ని కార్తీక మాసం తొలిరోజు శనివారం పర్యాటకశాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్లాన్ చేస్తున్నప్పటికీ నాగార్జునసాగర్ డ్యాం లో సరైన మట్టంలో నీటి లభ్యత లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుత వర్షాకాల సీజన్లో విస్తృతస్థాయిలో వర్షాలు పడడం వల్ల కృష్ణానది తీరం వెంట, అటు శ్రీశైలం నుండి ఇటు నాగార్జునసాగర్ డ్యాం వరకు గరిష్ట మట్టంలో నీటి లభ్యత ఉండటం వల్ల రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు ఈ బోట్ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ లాంచ్ ప్రయాణానికి మొట్టమొదటి రోజున తెలంగాణ రాష్ట్రం తో పాటు పరిసర రాష్ట్రాల నుండి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చారు. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది. శ్రీశైలంలో రూమ్, ట్రాన్స్ పోర్ట్ వంటికి ఎవరికి వారే భరించాల్సి ఉంటుంది.

# గుంతలు లేని రోడ్లే మా ధ్యేయం

విశాఖ నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :

గుంతల రోడ్లు నరకానికి రహదారులు అని.. రోడ్ల మీద గర్భిణీలు డెలివరీ అయ్యారని.. ఈ పాపం గత పాలకులదే అంటూ మండిపడ్డారు. గుంతల రోడ్ల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయని ఎంతోమంది చనిపోయారని అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఐదేళ్లలో రహదారుల కోసం కేవలం రూ.1000 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. మంచి రోడ్లు నాగరికతకు చిహ్నమని.. అభివృద్ధికి ఆనవాళ్లు మంచి రహదారులు అని చెప్పుకొచ్చారు. వచ్చే సంక్రాంతికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలన్నారు. వర్షం వస్తే గతంలో రోడ్లు స్విమ్మింగ్ ఫూల్‌ను తలపించే విధంగా ఉన్నాయన్నారు. రౌడీ రాజకీయాలు వద్దని.. అభివృద్ధి రాజకీయాలు కావాలని వెల్లడించారు. “నేను ఎక్కడకు వెళ్ళినా పరదాలు లేవు, చెట్లు కొట్టడం లేదు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి. మంచి రోడ్లు వస్తాయి” అని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలను, మద్యాన్ని తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చారని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలన్నారు. డబ్బులు ఊరికనే రావు... సంపద సృష్టిస్తే డబ్బులు వస్తాయన్నారు. రూ.860 కోట్లు తో రాష్ట్రంలో మొత్తం గుంతలు పూడుస్తున్నామన్నారు. రాష్ట్రంలో జగన్ విధ్వంసం సృష్టించారన్నారు. గాడి తప్పిన వ్యవస్థలను...గాడిలో పెడతానని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని రోడ్లు వేస్తామని ఇందుకోసం ఒక పక్కా ప్రణాళిక వేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**సురక్షిత ప్రయాణం కోసమే: మంత్రి నాదెండ్ల**

మరోవైపు విశాఖపట్నం పూర్ణ మార్కెట్ రామకృష్ణ థియేటర్ వద్ద గుంతల పూడ్చివేత కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గుంతలేని రహదారి కోసం ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. గతంలో రోడ్ల కోసం జనసేన సోషల్ మీడియా క్యాంపెయిన్ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ కారణంగా ఈరోజు రోడ్లు గుంతలు పూడ్చుకునే స్థాయికి దిగజారాల్సి వచ్చిందన్నారు. ప్రజల సురక్షితవంతమైన ప్రయాణం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

**గుంతల రహిత రాష్ట్రంగా ఏపీ : మంత్రి రామానాయుడు**

వచ్చే సంక్రాంతి నాటికి రూ.600 కోట్లతో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సాక్షి ప్రకటనలకు ఖర్చుపెట్టిన రూ.300 కోట్లు కూడా కనీసం రోడ్లకు జగన్ ఖర్చు పెట్టలేదని విమర్శించారు. గత ఐదు సంవత్సరాల పాలనలో అద్వాన రోడ్లతో ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవడం, వాహన మరమ్మతులకు జేబులు గుల్లవడం చూశామన్నారు. జగన్ పాలనలో మ్యాప్‌ను చూసి కాకుండా గుంతల రోడ్లను చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గుర్తించే స్థాయికి జగన్ దిగజార్చారంటూ మంత్రి రామానాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మంత్రి లోకేశ్ టూర్ సక్సెస్

అయితే జగన్ అమెరికా వెళ్లినా, ఢిల్లీకి వెళ్లినా స్వప్రయోజనాల కోసమే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచించిన పరిస్థితి లేదు. గత ఐదేళ్లలో పెట్టుబడుల ఊసే లేని నవ్యాంధ్రకు పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగింది. ప్రముఖ దిగ్గజ కంపెనీల అధిపతులతో విస్తృతంగా చర్చించారు. ఏపీలో ఏఏ రంగాలలో పెట్టుబడులకు అవకాశం ఉందో వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ పునరుద్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్ కార్లు, రియల్‌ఎస్టేట్ రంగంలోని ప్రముఖులతో సంప్రదింపులు జరిపి అమరావతి మొదలుకుని ఉత్తరాంధ్ర, గోదావరి, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే విధంగా ఆయా రంగాల్లో అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆయన పర్యటనలో సీఎంవో సంయుక్త కార్యదర్శి కార్తికేయ మిశ్రా కూడా పాల్గొన్నారు. గత నెల 25వ తేదీన హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన లోకేష్ మర్నాటి నుంచి వరుసగా వారం రోజుల పాటు అనేక సంస్థల సీఈవోలు, అధినేతలతో సమావేశమయ్యారు. శుక్రవారం అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణతో తన పర్యటనను ముగించుకున్న లోకేష్ భారత కాలమానం ప్రకారం ఈరోజు (శనివారం) ఉదయం స్వదేశానికి బయలుదేరుతారు. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

# జమ్ము కశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదులు ఏరివేత

న్యూఢిల్లీ,నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి : జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోంది. తాజాగా అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో హల్కన్ గలి ప్రాంతంలో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులకు భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కాగా, కశ్మీర్ లోయలో శుక్రవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన చేసిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల ఘటనలో ఇద్దరు కార్మికులు చనిపోగా.. ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని శ్రీనగర్‌లోని జేవీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన భద్రతా బలగాలు కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల కోసం తీవ్రంగా గాలింపు చేపడుతున్నారు. మరోవైపు శనివారం ఉదయం నుంచి శ్రీనగర్‌లోని ఖాన్యార్ ప్రాంతంలో తుపాకుల మోత మోగుతోంది. ఇక్కడ ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం యూపీకి చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భారత దళాలు.. వారిపై ఎదురు కాల్పులకు దిగారు. ప్రస్తుతం అక్కడ ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకూ ఇరువైపులా ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు లేవని వెల్లడించారు.

## మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు...

అమరావతి, నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :

ఇటీవల వైసీపీ పార్టీని వీడిన ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ... మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారని విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబుకు ఇచ్చిన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అఘాయిత్యానికి గురైన వారి పేర్లను బయటకు చెప్పడం దుర్మార్గమని, వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇక తాను రాజకీయాల్లో కొనసాగడంపై తన నిర్ణయాన్ని వారంలోగా వెల్లడిస్తానని వాసిరెడ్డి పద్మ అన్నారు.

## మొదలయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

అమరావతి, నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :

ఏపీలో నిలిచిపోయిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2022 లో నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది జనవరిలో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించగా, 4,59,182 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 95,208 మంది అభ్యర్థులు పరీక్షలో అర్హత సాధించారు. అయితే ఫిజికల్ టెస్ట్‌కు 91,507 మంది అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.ప్రిలిమినరీ పరీక్షల తర్వాత కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ పలు కారణాలతో నిలిచిపోయింది. దీంతో నిలిచిపోయిన భర్తీ ప్రక్రియను ప్రారంభించేందుకు ఏపీ సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇన్‌చార్జి చైర్మన్ ఆకే రవికృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి వారంలో ఫిజికల్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. ఫిజికల్ టెస్ట్ కు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. వారు ఈ నెల 11న సాయంత్రం 3 సాయంత్రం నుంచి సాయంత్రం 5 గంటల వరకు **slrb.ap.gov.in** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజాధనం దుర్వినియోగం

## రుషికొండ ప్యాలెస్ ను పరిశీలించిన చంద్రబాబు

విశాఖ నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి :



ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ విశాఖలో రుషికొండ భవనాలను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుషికొండపై కట్టిన భవనాలు చూశాక ఆశ్చర్యం, ఉద్వేగం కలిగాయని పేర్కొన్నారు. టూరిజం డెవలప్ మెంట్ కోసమే ఈ భవనాలు నిర్మించినట్టు గత ప్రభుత్వంలో అనేకసార్లు చెప్పారని, కానీ ఢిల్లీ పెద్దలు వచ్చినప్పుడు విశాఖలోని నేవీ అతిథి గృహంలోనే బస చేస్తుంటారని తెలిపారు. మరి ఎందుకు, ఎవరి కోసం రుషికొండ భవనాలు కట్టినట్టు? అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి స్వార్థం కోసమే రుషికొండ ప్యాలెస్ కట్టారని ఆరోపించారు.బాత్ టబ్ కోసం రూ.36 లక్షలు ఖర్చు చేశారని, గజపతి బ్లాక్ లో ఆఫీస్ కాంప్లెక్స్ కట్టారని వివరించారు. వీళ్లకు ఎక్కడ్నించి చూసినా సముద్రం వ్యూ కనిపించాలని, ఆ మేరకే భవనాలు కట్టారని చంద్రబాబు వెల్లడించారు. తన ప్యాలెస్ అన్నింటిలోకి ఇక్కడే అదిరిపోయే లగ్జరీ కనపడాలని కట్టించుకున్నట్టుందని వ్యాఖ్యానించారు. రుషికొండ భవన సముదాయంలోని కళింగ బ్లాక్ లో 300 మంది పట్టే కాన్ఫరెన్స్ హాల్ కట్టారని తెలిపారు. “రాజులు కూడా ఇలాంటి ఆఫీసులు కట్టుకుంటారని నేను అనుకోవడంలేదు... వాళ్లకు ఇన్ని తెలివితేటలు లేవు. ఆ కారిడార్ చూస్తుంటే అమెరికా వైట్ హౌస్ లో కూడా అలాంటిది ఉండదేమో అనిపించింది. మన రాష్ట్రపతి భవన్ లోనూ లేదు... రాష్ట్రపతి భవన్ లో ఉన్నది చిన్న కారిడారే... మేం ఢిల్లీ వెళ్లినప్పుడు చూస్తుంటాం... నాడు బ్రిటీష్ వాళ్లు ప్లాన్ చేశారు కానీ, అది చాలా చిన్న కారిడార్. వాళ్ల పీఏలకు కూడా రూములు కట్టుకున్నారు, పెద్ద కాన్ఫరెన్స్ హాల్ పక్కనే చిన్న కాన్ఫరెన్స్ హాళ్లు కట్టుకున్నారు. ఇప్పుడు గుండె చెదిరిపోయే వాస్తవాలు బయటికి వస్తున్నాయి... ఏకంగా 100 కేవీ సబ్ స్టేషన్, 200 టన్నుల సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేశారు. గతంలో షాండ్లియర్లు చూశాం... ఇక్కడ ఫ్యాన్సీ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది, సర్వెంట్ల కోసం ఒక పెద్ద బ్లాక్ కట్టారు. ఇలాంటివి కలలో కూడా ఊహించలేం. నాకు చాలా ఆశ్చర్యం వేస్తోంది. నేను చాలా దేశాలు తిరిగాను కానీ, ఈ దొంగలకు ఇంత ఇన్నోవేషన్ ఎలా వచ్చిందో అర్థం కావడంలేదు. మంచి నీళ్ల మాదిరిగా డబ్బులు ఖర్చు పెట్టారు. అవి వాళ్ల సొంత డబ్బులు కాదు. అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. హైకోర్టును, ఎన్జీటీని, కేంద్ర ప్రభుత్వాన్ని కూడా మభ్యపెట్టారు. అధికారులను కూడా మభ్యపెట్టారు. ఇప్పుడవన్నీ కరెక్టుగా విచారణ జరిగితే ఎంతోమంది ఎగిరిపోతారు. ఇతడు ఒక దుర్మార్గుడు, ఒక కరడుగట్టిన నేరస్తుడు... అందుకే నేను అనేది ఎస్కోబార్ అని. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండాలా అనేదానిపై చర్చ జరగాలి. పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం అంటాడు... పేదల పేరు చెప్పి ఇలాంటి విలాసవంతమైన భవనాలు కట్టుకుంటాడు. మనం చేసే పని తప్పా, ఒప్పా అనేది మనస్సాక్షి చెబుతుంది... అలాంటిది మనస్సాక్షిని కూడా లెక్కచేయని పరిస్థితికి వచ్చాడు” అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 3 నవంబర్ 2024

# ఇల్లు కట్టుకునే వారిదా.? అధికారులదా.? తప్పు ఎవరిది.?



- ఇల్లు కట్టుకోవాలి అంటే నిభందనలు ఏంటి.
- ఇల్లు కట్టుకునేవారికి అధికారులు అధికారులు నిభందనలు చెపుతున్నారా.?
- నిభందనలు చెపితే ఫైల్స్ పెండింగ్ ఎందుకున్నాయి.?
- డబ్బులు కట్టించుకొని షాట్ ఫాల్ పెట్టీ ఇబ్బందులు పెట్టడం కరెక్టా.?
- కట్టేంతవరకు సైలెంట్...కట్టిన తర్వాత డిమాండ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 2: ప్రజలందరికీ చిరుకాల కోరిక సొంత ఇల్లు కట్టుకోవడంవ్యాపారాల్లో,ఉద్యోగాల్లో స్థిరపడి పిల్లలకు పెళ్ళిళ్ళు చేసి,బరువు బాధ్యతలు తీరిన తర్వాత ప్రతి ఒక్కరి జీవిత ఆశయం సొంత ఇల్లు కట్టుకోవడం.చిన్నతనం నుంచి పెద్దవారు అయిన తర్వాత 50 ఏళ్లు పై బడ్డాక కాస్తో,కూస్తో కూడబెట్టి స్థలం కొని ఇళ్ళు కట్టుకోవాలని అనుకునే వారిలో కొందరికి ప్రభుత్వ నిభందనలు తెలియక,కొందరికి అన్ని నిభందనలు ఉన్నా ఏదో ఒక వంక చూపెడుతూ వారు అనుకున్నంత పైసలు ఇస్తేనే అనుమతులు ఇచ్చే పరిస్థితి టౌన్ ప్లానింగ్ లో నడుస్తుంది.సాఫ్ట్వేర్ రంగం వచ్చిన తర్వాత ఉద్యోగాలు రావడం,జీతాలు బాగా ఉండడంతో ఇళ్లు కట్టుకోవడం,కట్టిన ఇల్లు కొనుగోలు చేయడం,అపార్ట్మెంట్ కొనుగోలు చేయడం అధికం అయింది.అన్ని ఉన్నా అల్లుడునోట్లో శని అన్న చందంగా నిభందనలు సరిగా ఉన్నా కొందరు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొంది.ప్రజలకు నిభందనలు చెప్పకుండా,డబ్బులు కట్టించుకొని అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.టౌన్ ప్లానింగ్ అధికారులకు డబ్బులు ఎందుకు ఇవ్వాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వివరాల్లోకి వెళితే ప్రజలు ఎవరైనా స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకోవాలంటే ముందుగా ఖాళీ స్థలానికి పన్ను కట్టాల్సిఉంది.ఇక్కడ కూడా ఖాళీ స్థలానికి పన్ను వేయించుకోవాలంటే మున్సిపల్ రెవెన్యూ అధికారులకు చేతులు తడిపితేనే ఖాళీ స్థలానికి తొందరగా పన్నులు వేస్తారు.అక్కడ నుంచి ఇల్లు కట్టుకునే వారు స్థలానికి సంభందించిన డాక్యుమెంట్, ఈసి,బిల్డింగ్ ప్లాన్,డిజైన్ ,ఆధార్ కార్డు తదితర డాక్యుమెంట్స్ అన్ని తీసుకొని గతంలో మున్సిపాలిటీ లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో నీ అధికారులను కలిసేవారు.ప్రజలకు సేవలు అందుబాటులో ఉండాలని అన్ని వార్డుల్లో సచివాలయం లు ఏర్పాటు చేశారు.అక్కడ టౌన్ ప్లానింగ్ కు సంబందించి ప్లానింగ్ సెక్రటరీ నీ నియమించారు.ఇల్లు కట్టుకునేవారు ప్లానింగ్ సెక్రటరీ కి తమ వద్ద ఉన్న డాక్యుమెంట్స్ అందించాలి.అక్కడనుంచి టౌన్ ప్లానింగ్ అధికారుల లాగింగ్ లోకి వెళుతుంది.ఇక ఇక్కడనుంచి అసలు కథ నడుస్తుంది.ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి ఇచ్చిన డాక్యుమెంట్స్ లో పొరపాట్లు ఉంటే ముందుగా గుర్తించి సంభందించిన వారికి మీరు పెట్టిన ఫైల్ లో తప్పులు ఉంటే ముందుగానే తెలియపరచాలి.అధికారులు ఇవేవీ వారికి తెలియకుండా ముందు ప్రభుత్వానికి కట్టవలసిన డబ్బు కట్టండి అని చెప్పడంతో ప్రజలు డబ్బులు చెల్లిస్తారు. డబ్బులు కట్టడంతో ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బందులు ఏవి ఉండవని కొందరు ఇళ్ల నిర్మాణం చేపడతారు.నిర్మాణం కట్టకముందు అవి తకువ ఉండాయి,ఇవి తక్కువ ఉండా యి అని టౌన్ ప్లానింగ్ అధికారులు చెపితే ఒట్టు.నిర్మాణం చివరి దశ వచ్చేసరికి అప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు రంగప్రవేశం చేసి మీ ఇంటికి అవి లేవు,ఇవి లేవు అంటూ షాట్ ఫాల్,డెడ్ ఎండ్,సెట్ బ్యాక్స్, ప్రభుత్వానికి స్థలం ఇవ్వలేదు,14 శాతం పన్ను చెల్లించలేదు అనే వంక పెడుతూ అటు నిర్మాణం కాకుండా,బ్యాంక్ లోన్ రాకుండా చేయడంతో విధి లేక అధికారులు అడిగినంత ముట్ట చెపుతున్నారు.డబ్బు ముట్టితే చాలు ఎలాంటి షాట్ ఫాల్,నిభందనలు లేవు అనే ఊసే ఎత్తరు.మనిషిని బట్టి,ఇంటిని బట్టి ధరలు నిర్ణయిస్తారు.ఈ చిక్కు అంతా వచ్చేది పేద,మధ్య తరగతి ప్రజలకే.బడా బాబులు నిభందనలు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా అటువైపు కన్నెత్తి చూడరు.ప్రజలకు అధికారులు నిభందనలు ముందుగా చెపితే సమస్యలు ఉండవు కదా.ప్రస్తుతం నంద్యాల మున్సిపాలిటీ లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో 260 ఫైల్స్ పెండింగ్ లో ఉండాయంటే అర్థం ఏమిటి.వారందరికీ డబ్బు కట్టించుకొక ముందే సమస్య చెపితే సరి చేసుకునే వారు కదా. ఇళ్ళు కట్టుకోవాలంటే అధికారులకు లంచం ఎందుకు ఇవ్వాలి.లంచం తీసుకోకుండా అధికారులు అనుమతులు ఇవ్వరా.ఏసిబి,విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసినా ,చర్యలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.తప్పు ఎవరిది.అధికారులదా ఇళ్ళు కట్టుకోవాలి అనుకునేవారిదా ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుందా.? భవిష్యత్తులోనైనా ఈ ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందని వేచి చూద్దాం.

## ప్రధమ నంది దేవస్థానం లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కలెక్టర్







ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 02: కార్తీకమాసం సందర్భంగా ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం నందు మంత్రి మరియు కలెక్టర్ ఇతర నాయకులు స్వామివారికి అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు అనంతరం అతిధులను దేవస్థానం అధికారులు సన్మానించడం జరిగింది.ఆ తర్వాత అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంత్రి మరియు కలెక్టర్ జరిగింది ప్రారంభించడం జరిగింది ప్రధమనంది దేవస్థానం కున్న విస్తీర్ణం ఏ దేవస్థానానికి నంద్యాలలో లేదని ఈ దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని దేవస్థానంలో జరగవలసిన పనులు పై ఒక నివేదిక తయారు చేసి తనకి ఇస్తే దేవాదాయ శాఖ మంత్రి తో మాట్లాడి దేవస్థానంలో అభివృద్ధి పనులకు తగినంత నిధులు విడుదల చేయిస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు.


దేవస్థానానికి ప్రహరీ గోడ మరియు ఉత్తరం తూర్పు వైపున మాడవీధులు అలాగే ఒక మినరల్ వాటర్ ప్లాంట్ అసంపూర్తిగా ఉన్నటువంటి గదుల నిర్మాణం గురించి దేవస్థానం అధికారులు సేవకులు మంత్రికి వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు, బలిజ సంఘం నాయకులు రాజారాం,12వ వార్డ్ కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు శ్యామ్సుందర్ గుప్తా, మాజీ కౌన్సిలర్ తెలుగుదేశం నాయకుడు ఉసేని, తెలుగుదేశం కౌన్సిలర్లు నాగార్జున,మరియు శ్రీదేవి, దేవస్థానం అధికారులు,



ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం సేవకులు రామ శివారెడ్డి,జిల్లా ఎలక్ట్రానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు చలం బాబు, కృష్ణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ఆచారి నరసింహులు,సుధాకర్, రమణ, శేషు, నాగరాజు, రాజారెడ్డి, ప్రసాదు ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.



ఆంధ్ర ప్రగతి దొర్నిపాడు నవంబర్ 02: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో దొర్నిపాడు మండలం, భాగ్యనగరం గ్రామంలో వెలసిన శ్రీ రామాలయం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, స్థానిక మహిళలచే కుంకుమార్చన మరియు గోపూజ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి. వి. వీరాంజనేయ రావు, ఆలయ ధర్మకర్త వీరగంధం బ్రహ్మయ్య, అర్చకులు వారణాసి ప్రసాద్ శర్మ, గోపాల కృష్ణయ్య, నరసింహ, కోయ పుల్లయ్య నాయుడు, వేణు గోపాల్ రెడ్డి, శారదమ్మ, సీతమ్మ, పార్వతి, భాగ్యమ్మ, ఉమ, అక్షరమ్మతోపాటు పెద్ద సంఖ్యలో మాతృమూర్తులు పాల్గొన్నారు.

## చెంచుల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఖచ్చితమైన సర్వే నిర్వహించండి.!

-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 02: నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని చెంచు గూడెంలలో మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు పకడ్బందీ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో చెంచుల జీవన ప్రమాణాల సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్, డిపిఓ జమీవుల్లా, ఆత్మకూరు డిఎల్డిఓ సూర్యనారాయణ, నంద్యాల డిఎల్డిఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 14 మండలాల్లోని 48 చెంచుగూడెంలలో 2095 కుటుంబాల్లో దాదాపు 8,000 మంది చెంచు గిరిజనులు జీవనం కొనసాగిస్తున్నారని వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు పకడ్బందీ సర్వే నిర్వహించి సమగ్ర వివరాలు సేకరించాలని పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. గూడెంలలో పక్కా ఇల్లు, త్రాగునీటి సౌకర్యం, విద్యుత్, రహదారి సౌకర్యం, టాయిలెట్లు తదితర కనీస అవసరాలు, ప్రత్యేకించి రేషన్‌కార్డు, ఆధార్, ఆరోగ్య, కుల ధ్రువీకరణ తదితరాలతో పాటు వారి జీవన చెంచుల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏ ఏ చర్యలు చేపట్టాలి అనే అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. ఇందుకోసం 32 కాలమ్ లతో కూడిన ప్రొఫార్మా అందజేస్తున్నామని సచివాలయ సిబ్బంది 5 మంది గ్రూపుగా వెళ్లి పైలెట్ సర్వే నిర్వహించాలన్నారు. గూడెం ప్రజలతో కలిసిపోయి నెమ్మదిగా వివరాలు సేకరించి పక్కా సమాచారంతో కూడిన నివేదికలు ఈనెల 5వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల తాను మూడు గూడెంలను సందర్శించానని నివసిస్తున్న గుడిసెలపై టార్పాలిన్ కప్పుకోవడం, మంచినీటి సౌకర్యం లేకపోవడం, పిల్లలు తల్లిదండ్రుల వెంట అడవుల్లోకి వెళ్లడం, పరిశుభ్రంగా లేకపోవడం గమనించానన్నారు. జిల్లాలో ఇంకా జానాల గూడెం, పెచ్చెరువు గూడెంలకు విద్యుత్ సౌకర్యం లేదన్నారు. చెంచుగూడెంలలో జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు పక్కా సమాచారాన్ని సేకరించి ఇస్తే చక్కటి డిపిఆర్ తయారుచేసి ప్రభుత్వానికి సమర్పిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## మిషన్ పార్ట్ హెూల్ ఏపీ ఫ్రీ రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిల ప్రియ.





ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ నవంబర్ 02: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మిషన్ పార్ట్ హెూల్ ఏపీ ఫ్రీ రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామనందు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిలాప్రియ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో మంచి పనులు చేస్తున్నామని గతంలో ఇచ్చిన హామీలను మర్చిపోకుండా నెరవేరుస్తున్నామని, గత వైసిపి ప్రభుత్వం లో ఆంధ్రప్రదేశ్ అంటే గుంతల రాష్ట్రంగా పేరు గాన్చిందని, ఆనాడు రోడ్లపై వైసీపీ నాయకులపై మేము అలాగే ప్రజలు వినూత్న రీతిలో వీడియోలు ద్వారా నిరసనలు తెలిపామని, కానీ మా ఈ టిడిపి ప్రభుత్వంలో ఎవరు కూడా ఇబ్బంది పడకూడదని ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారని అందులో భాగంగానే నేను ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న గుంతలను పూడిపిస్తున్నామని అఖిల ప్రియ తెలియజేశారు. ఆళ్లగడ్డ తాలూకాకు 80 లక్షల రూపాయలు 65 కిలోమీటర్లు మేరకు గుంతలు పూడ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రెండవ కోటలో నాలుగు కోట్లు శాంక్షన్ చేయించుకొని మిగతా పనులు మొదలు పెడతామని చాలా దారుణంగా ఉండే రోడ్లను నేడు కళ్ళు మూసుకుని వెళ్లేలా సంక్రాంతికి పనులన్నీ పూర్తి చేయాలని అఖిల ప్రియ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొదటి కోటా గాను 400 కిలోమీటర్లకు నాలుగు కోట్ల 50 లక్షలు రూపాయలు శాంక్షన్ చేయడం జరిగిందని, ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తెప్పించుకొని ప్రతి ఒక్క పనిని తాను చేసి చూపిస్తానని టిడిపి ప్రభుత్వంలో ఆళ్లగడ్డను అభివృద్ధి బాటలో తీసుకెళ్తానని ఎమ్మెల్యే అఖిలప్రియ తెలియజేయడం జరిగింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# గుంతలు లేని రహదారులుగా నంద్యాలను తీర్చిదిద్దుతాం.!

**-ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం.ఐ-రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్.!**

**-జిల్లాలో మొత్తం 369 కిలోమీటర్ల రహదారిలో గుంతలు పూడ్చేందుకు గాను 4.57 కోట్ల రూపాయలు మొదటి విడతగా మంజూరు.**

**-సంక్రాంతిలోపు గుంతలు లేని రహదారుల పనులు పూర్తి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 02 : ఆర్ అండ్ బి రహదారులను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు వద్ద మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఏపి (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం కింద రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గుంతలు లేని రోడ్డు పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు నుండి శ్రీనివాస నగర్ జంక్షన్ వరకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అధిక ట్రాఫిక్ ఉన్న ఈ జంక్షన్లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ చేసి ఇచ్చారని వచ్చే బడ్జెట్లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించుకుని ప్రారంభించడం జరుగుతుందన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కూడా మన జిల్లా వాసి అయినందున రోడ్ల అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో కూడా స్థానిక శాసనసభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని గుంతలు లేని రహదారుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. జిల్లాలోని ఆర్ అండ్ బి రహదారుల్లోని గుంతలు పూడ్చేందుకుగాను ప్రభుత్వం 4.57 కోట్ల రూపాయలను మొదటి విడతగా మంజూరు చేసిందన్నారు. వచ్చేఏడాది జనవరి 15వ తేదీలోపు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 369 కిలోమీటర్ల రహదారిలో గుంతలు పూడ్చేందుకు గాను మొదటి విడతగా ప్రభుత్వం 4.57 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. సంక్రాంతి పండుగ లోపు రహదారుల్లోని అన్ని గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా



మంజూరులు వస్తాయన్నారు. దీంతోపాటు పంచాయతీరాజ్, మున్సిపల్ రోడ్ల పనులు కూడా మంజూరు కావాల్సి ఉందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఈ కార్యక్రమం పై పర్యవేక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా గుంతలమయం లేని రోడ్లను తీర్చిదిద్దుకోవడం జరుగుతుందన్నారు. ఆర్.అండ్.బి రహదారులను గుంతలు లేని రహదారులుగా చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, తదితర ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# లక్ష రూపాయల శాశ్విత సభ్యత్వం తీసుకున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిబాబు



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 02: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటుపల్లి హరిబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం (లక్ష రూపాయల సభ్యత్వం) తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ హరిబాబును అభినందించడం జరిగింది.

# ముద్దం వన్షిక మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.








ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 02: నంద్యాల పట్టణానికి చెందిన మంత్రి ఎన్ ఎండి ఫరూక్ సోషల్ మీడియా టిడిపి సీనియర్ నాయకులు పీఆర్వో ముద్దం నాగ నవీన్ కూతురు జన్మదినం సందర్భంగా ముద్దం వన్షిక మొదటి పుట్టినరోజు వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని కేక్ కట్ చేయించి,చిన్నారి వన్సిక ను ఆశీర్వదిస్తూ.. చిన్నారి నిండు నూరేళ్లు జీవించాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం కౌన్సిలర్లు , మాజీ కౌన్సిలర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చెత్తను సేకరించేందుకు నూతన ట్రాక్టర్లను ప్రారంభించిన మంత్రి ఎన్ ఎండి ఫరూక్







ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 02: జిల్లా కేంద్రమైన నంద్యాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, పట్టణమంతా సుందరికరణ పనులు చేపట్టి పరిశుభ్రమైన నంద్యాలగా మార్చి ప్రజలను రోగాల నుండి కాపాడుతాం అని మంత్రి ఎన్ ఎండిఫరూక్అన్నారు.

నంద్యాల పట్టణంలో మున్సిపల్ కార్యాలయ అవరణలో నంద్యాల పట్టణంలోని చెత్తను సేకరించి డంప్ యార్డుకు చేర్చేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2 నూతన ట్రాక్టర్లను కొనగోలు చేసి తన చేతులమీదుగా ఎన్ ఎండి ఫరూక్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. నంద్యాలలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని నంద్యాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2 ట్రాక్టర్లను కొనగోలు చేసి ప్రారంభించడం జరిగిందన్నారు.

జిల్లా కేంద్రం నంద్యాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. చంద్రన్న ప్రభుత్వం రాగానే చెత్త పన్నుని తొలగించడం జరిగిందన్నారు.పట్టణంలో చెత్తను ఎక్కడ బహిరంగంగా పారావేయ్యకుండా ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి డంప్ యార్డ్ కు తరిలించి ప్రజలను రోగాల బారిన పడకుండా చూస్తున్నామని తెలిపారు.

అలాగే పట్టణంలోని డ్రైనేజీ కాల్వల మరమ్మత్తులు రోడ్లకు మరమ్మత్తులు చేస్తామని ఆక్రమణలు తొలగించి నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతామన్నారు.నంద్యాలను పరిశుభ్రంగా ఉంచి సుందరికరణ కొరకు చర్యలు చేపట్టి ప్రజలు ఆహ్లాదకరంగా జీవించేలా ఈ ఐదేళ్లలో నంద్యాలను తీర్చిదిద్దుతామని కృషి చేస్తామన్నారు. అదేవధంగా నంద్యాల ప్రజలు చెత్తను కాల్వల్లో / రోడ్ల పై వెయ్యకుండా చెత్తను వేరుచేసి ఇంటివద్దకు వచ్చిన మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి నంద్యాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యాక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేరుగ నాగార్జునపై సీఐడీ విచారణ జరపాలి

## మాజీ మంత్రి నక్కా ఆనందబాబు



గుంటూరు, నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి : లైంగిక వేధింపులు, మోసం చేశారనే ఆరోపణలతో మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు స్పందించారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై సీఐడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విజయవాడ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోతైన విచారణ చేయాలన్నారు. ట్రైబల్ టీచర్‌ను మేరుగ నాగార్జున హత్య చేసినట్లు మహిళ చెప్పిందని.. ట్రైబల్ టీచర్ హత్యపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. లైంగిక వేధింపులతో పాటు మేరుగ నాగార్జున అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు డిమాండ్ చేశారు. కాగా.. మాజీ మంత్రి నాగార్జునపై ఓ మహిళ లైంగిక వేధింపుల ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విజయవాడకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. "మాజీ మంత్రి నాగార్జున ఆయన నిర్వహించే శాఖ పరిధిలో పలు కాంట్రాక్టులు ఇప్పిస్తానని నా వద్ద రూ.90 లక్షలు తీసుకున్నారు. ఎన్నిసార్లు తిరిగినా పనులు ఇప్పించలేదు. కాంట్రాక్టు పనులు ఇప్పించమని అడగడానికి వెళ్లిన నాపై మాజీ మంత్రి నాగార్జున నాలుగుసార్లు అత్యాచారం చేశాడు" అంటూ బాధితారులు వాపోయింది.

# మూడేళ్ల బాలికపై అత్యాచారం

తిరుపతినవంబర్ 2 ఆంధ్ర ప్రగతి : తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. వరుసకు మామ అయ్యే యువకుడు బాలికకు చాకెట్లు ఆశచూపి దారుణానికి పాల్పడ్డాడు. నిన్న సాయంత్రం గ్రామంలోని స్కూల్ సమీపంలోకి తీసుకెళ్లి ఆ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి ఆమెను చంపివేశాడు. తమ కూతురు కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు శనివారం వెల్లడించారు. క్లూస్‌ను సేకరించి నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. బాలిక మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. కేసును ఫాస్ట్ ట్రాక్‌కోర్టులో గాని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా ఈ ఘటనపై సీఎం చంద్రబాబు, హెూం మంత్రి అనిత స్పందించారు. ఈ సందర్భంగా ఘటనపై వారు విచారం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, చిన్నారి కుటుంబానికి రూ. 10 లక్షలు అందజేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.

# తొక్కిపట్టి నార తీస్తానన్న పవన్ ఇప్పటిదాకా ఎంతమందికి తీశారు?: రోజా



తిరుపతి నవంబర్ 2 ఆంధ్ర ప్రగతి : కూటమి ప్రభుత్వ పెద్దలపై మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా ధ్వజమెత్తారు. తిరుపతి జిల్లా వడమాలపేటలో బాలికపై హత్యాచారం జరిగిందంటూ రోజా మండిపడ్డారు. ఇవాళ ఆమె బాలిక తల్లిదండ్రులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అసమర్థత వల్లే నేరస్తులు తెగబడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హెూంమంత్రి అనిత సిగ్గుపడాలని అన్నారు. ఆడవాళ్లను ఎవరైనా బాధపెడితే తొక్కిపట్టి నారతీస్తానని పవన్ గతంలో అన్నారని, ఇప్పటిదాకా 100 మంది ఆడబిడ్డలు ప్రాణాలు వదిలితే, ఎంతమందికి పవన్ నారతీశారో చెప్పాలని మండిపడ్డారు. చేతిలో అధికారం ఉండి కూడా, నేరగాళ్లలో భయం కల్పించలేకపోతున్నారని రోజా వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం లైసెన్సులు ఇచ్చిందని, బెల్టు షాపులు కూడా తయారయ్యాయని... మద్యం మత్తులోనే అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహణ .!

**-కేసు నిరూపణ చేసి, నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది.**

**-ప్రతి కేసు నిరూపణ చేయుటకు చిత్తశుద్ధితో పనిచేసి, బాధితులకు న్యాయం చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 02: శనివారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్ట్ మానిటరింగ్ సిస్టం అధికార సిబ్బందితో స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లాలోని పెండింగ్ కేసుల స్థితిగతులపై జిల్లా కోర్టు మానిటరింగ్ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య సమావేశం నిర్వహించారు.




ఈ సందర్భంగా జిల్లా కోర్టు మానిటరింగ్ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య గారు జిల్లా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్ట్ మానిటరింగ్ సిస్టం అధికార సిబ్బందితో మాట్లాడుతూ కేసు నమోదు చేయడం,ముద్దాయిలను అరెస్టు చేయడం, చార్జ్ షీటు వేయడం,ఒక ప్రక్రియ అయితే, కోర్టులో విధివిధానాలను సరిగ్గా పాటించి, కేసును నిరూపణ చేయడంలో కోర్టు కానిస్టేబుళ్లు అయిన మీరు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నరు. కావున ప్రతి కేసు నిరూపణ చేయుటకు చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు న్యాయం చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు.నాన్ బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి, ఎప్పటికప్పుడు సర్వ్ చేయాలన్నారు.పాత పెండింగ్ కేసులపై శ్రద్ధ చూపి, వారెంట్లు సర్వ్ చేయాలన్నారు.పోలీసుల అలసత్వం వలన కోర్టులో విచారణ పెండింగ్ లేకుండా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం వారు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి కేసు నిరూపణ వచ్చే విధంగా దర్యాప్తు అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి, కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేస్తే ఆ రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు జాగ్రత్త పరచాలన్నారు.కేసు విచారణ సమయంలో సాక్షులు, సాక్షాధారాలు, రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు కోర్టులో పొందుపరచాలన్నారు. దర్యాప్తు అధికారులు కేసు విచారణకు హాజరయ్యేలాగా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్ట్ మానిటరింగ్ సిస్టం వారు బాధ్యతాయుతంగా ముందస్తు చర్యలు తీసుకోవాలి.మీ విధులను సమర్థవంతంగా నిర్వర్తించి, కేసులు నిరూపణ చేస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేసి పోలీస్ శాఖ ప్రతిష్ఠతను ప్రజలలో పెంపొందింపజేయాలని కోర్టు కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం చేశారు.